క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేత



కేంద్రానికి అందించిన కుర్చీల్లో చిన్నారులు

ఖానాపూర్: నిర్మల్ పట్టణానికి చెందిన బాస ప్రీతి–ప్రశాంత్ దంపతులు ఉద్యోగరీత్యా లండన్‌లో ఉంటున్నారు. వీరికి ఐరా, అయాన్ అనే బాబు, పాప(కవలలు) ఉన్నారు. వీరి వీరి మొదటి పుట్టినరోజును పురస్కరించుకుని ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్, సత్తనపల్లి అంగన్‌వాడీ కేంద్రాలకు 47 కుర్చీలను అందజేశారు. తర్లపాడ్‌కు 22 కుర్చీలు, సత్తనపల్లికి 25 కుర్చీలను చిన్నారుల కోసం కేంద్రాలకు అందించారని కేంద్రాల టీచర్లు సుకన్య, దేవిక తెలిపారు.

కడెం ఎంపీవోగా కవిరాజు



విధుల్లో చేరుతున్న ఎంపీవో

కడెం: మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)గా జీ.టి.కవిరాజు బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఎంపీడీవో అరుణకు జాయినింగ్ లెటర్ అందించారు. నూతన ఎంపీవోకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. దస్తురాబాద్ ఎంపీవో ఇది వరకు కడెం ఇన్‌చార్జి ఎంపీవోగా విధులు నిర్వహించారు.

యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గం

దిలావర్‌పూర్: యూత్ కాంగ్రెస్ దిలావర్‌పూర్ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్ననట్లు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. యూత్ కాంగ్రెస్ దిలావర్‌పూర్ మండల అధ్యక్షుడిగా కాల్వ గ్రామానికి చెందిన అంగూర్ మహేంధర్, ఉపాధ్యక్షులుగా దిలావర్‌పూర్‌కు చెందిన కోడె విజయ్, న్యూలోలంకు చెందిన శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మ గణేశ్‌తో పాటు మరో పది మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికైనట్లు వెల్లడించారు.

అభివృద్ధికి కృషి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏజీఎం నారాయణ్

కుంటాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఆ శాఖ ఏజీఎం నారాయణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుంటాల పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సంఘం ద్వారా సభ్యులకు ఇచ్చిన రుణాలను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. వారి వెంట అసిస్టెంట్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, భోజేందర్, మహేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

రేపటి విజయయాత్ర జయప్రదం చేయాలి



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 20న జరిగే వీర హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని భజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీవీర హనుమాన్ విజయయాత్ర పాటల సీడీ, స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసవేణి ప్రణయ్, పడాల ప్రభాకర్, ఆసం ఉదయ్, ముక్కిరాల శ్రీను, లోకేశ్, సంజయ్, భూమేశ్, యోగి, శ్రీధర్, అఖిలేశ్వర్ తదితరులు ఉన్నారు.

నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన



మంగళహారతులతో వస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం నవగ్రహాల ప్రతిమలను మంగళహారతుల నడుమ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. శుక్రవారం మండల పూజ, హోమం, ధాన్యదివాసం, పుష్పది వాసం, ఫలదివాసం, నవగ్రహ విగ్రహ ప్ర తి ష్ఠాపన అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. భక్తులు తరలిరావాలని గ్రామపెద్దలు కోరారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షా సేవా సమితి సభ్యులు, స్వాములు ఉన్నారు.

గుంతల రోడ్లతో అవస్థలెన్నో..

- గ్రామాల్లో అధ్వానంగా రోడ్లు
- కంకరతేలి ప్రమాదకరంగా మారిన వైనం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కన్కపూర్–ఆష్టా రోడ్డు దుస్థితి



సేవాలాల్‌తండా నుంచి నర్సింహనగర్ తండా వెళ్లే రోడ్డుపై తేలిన కంకర

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకరతేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

15 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సేవాలాల్‌తండా నుంచి నర్సింహనగర్ వరకు (మూడు కిలోమీటర్ల రోడ్డు), కన్కపూర్ నుంచి ముధోల్ మండలంలోని ఆష్టా వరకు ఉన్న ఏడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

మరమ్మతులు కరువు..

రాయపూర్‌కాండ్లీ నుంచి ఎడ్‌బిడ్ వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డుతోపాటు కన్కపూర్–ఆష్టా రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వర్షాలకు ఈ రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. కంకర తేలడంతో పాటు పలుచోట్ల రోడ్లు కోతకూ గురయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు ఓ గుంతను తప్పించే యత్నంలో మరో గుంతలో పడుతున్నారు. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

ఆయా గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నా.. మరమ్మతులు చేయించేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో నామమాత్రంగా మరమ్మతులు చేయించినా ఫలితం లేదని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళ్తుండడంతో అధ్వాన స్థితికి చేరాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



రాయపూర్‌కాండ్లీ–ఎడ్‌బిడ్ రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు పడి కంకర తేలడంతో పలువురు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయమేస్తోంది. అధికారులు మరమ్మతులు చేయించాలి.

– గోవింద్, రాయపూర్‌కాండ్లీ

నరకం కనబడుతోంది



కన్కపూర్–ఆష్టా రోడ్డుపై కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ ప్రయాణించాలంటే నరకం కనబడుతోంది. పలువురు కిందపడి గాయాల పాలవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– ముత్యం,కన్కపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని సేవాలాల్‌తండా–నర్సింహనగర్, కన్కపూర్–ఆష్టా రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. వీటితోపాటు మండలంలోని మిగతా గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల విషయమై ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే మరమ్మతులు ప్రారంభిస్తాం.

– రఘువంశీ, పీఆర్ జేఈ, లోకేశ్వరం

బాబోయ్.. ఆర్టీసీలో ప్రయాణం

- జీరో టికెట్‌తో విపరీతమైన రద్దీ
- సీట్లు దొరకక నిల్చునే వెళ్తున్న జనం
- బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్న వైనం



భైంసా–నిజామాబాద్ బస్సులో ప్రయాణికుల రద్దీ



ముధోల్ బస్టాండ్‌లో బస్సు కోసం చూస్తున్న జనం



బాసర రైల్వేస్టేషన్ స్టేజీ వద్ద బస్సు ఆపాలని కోరుతున్న ప్రయాణికులు

భైంసాటౌన్: 'ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం .. సుఖవంతం' అని ఆ సంస్థ నినాదం. కానీ ఇది ఇదివరకటి మాట. ప్రస్తుతం మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం మాటేమో కానీ సుఖవంతం మాత్రం అనిపించడం లేదని మహిళా ప్రయాణికులే వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం మంచి నిర్ణయమే అయినా పెరిగిన రద్దీతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటుండడంతో కొన్ని ట్రిప్పుల్లో ఓఆర్ (ఆక్యుపెన్సి రేషియో)శాతం వందకు మించి నమోదు అవుతోంది. బస్సు ప్రారంభ స్టేజి వద్ద సీటు దొరకడమే కష్టంగా మారింది. దాదాపు అన్ని ట్రిప్పులు బస్సులు ఓఆర్‌కు మించి నడుస్తున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. బస్సు కదిలింది మొదలు ప్రతి స్టేజిలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండడం, తీరా బస్సు వచ్చినా సీట్లు లేక గంటల తరబడి నిల్చునే ప్రయాణం చేస్తున్నారు. కొన్నిసార్లు బస్సులో స్థలం లేక డ్రైవర్లు బస్సు ఆపకుండానే వెళ్తున్నారు. దీంతో అత్యవసర పనులపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ వేళ సర్వీసులు పెంచి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'బీజేపీ గెలుపునకు కృషి చేయాలి'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామారావ్

భైంసాటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నగేశ్ గెలుపునకు కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చేలా పని చేయాలని సూచించారు. మోదీ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పేర్కొన్నారు. రావుల దేవేందర్, రావుల శివ, మంతొల్ల శివన్న, పార్డే లక్ష్మణ్ (కాంతం) బోసిరాజు, పోగుల రాజు, ఆకుల రాజు, దశరథ్, రావుల అశోక్, ఆనంద్ తదితరులు పార్టీలో చేరారు.

నిర్మల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో నగేశ్‌కు ఓటు వేసి బీజేపీ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొట్ల(కే)లో ఉపాధిహామీ కూలీలను కలిసి బీజేపీ మేనిఫెస్టో వివరించారు. ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు పిచ్చెక్కి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, రాములు, అనిత, రాజన్న, నరేశ్, భీమన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



పనిప్రదేశం వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

భైంసారూరల్: కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చుచుంద్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. గ్రామస్తుల అవసరం మేరకు ఈజీఎస్ పనులను పారదర్శకతతో చేయించాలని సిబ్బందికి సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో చల్లటి వాతావరణంలో పని గంటలు పెంచుకుంటూ ఉపాధి పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఈజీఎస్ ఏపీఓ శివలింగం, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

వెదురు వాహనం పట్టివేత

కడెం: వెదురు బొంగులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. మండలంలోని అంబారిపేట్ గ్రామం వద్ద అక్రమంగా వెదురు బొంగులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని బుధవారం రాత్రి పట్టుకుని కడెం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

అన్నదానం

సారంగాపూర్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండలంలోని జామ్ పట్టాభిరామాలయంలో వీడీసీ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆలయంలో పూజలు, స్వామివారి పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అనంతరం అన్నదానం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. ఇబ్బందులు రాకుండా వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఘనంగా శోభాయాత్ర

ఖానాపూర్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ హనుమాన్ ఆలయం నుంచి సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులతో రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రలో నృత్యాలు చేశారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఎస్సై లింబాద్రి, తదితరులు శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కావలి సంతోష్, నాయిని సంతోష్, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, కంటం రవి, జనార్దన్, గంగాధర్, పాదం రాకేశ్, చంద్రహాస్, శ్రీనివాస్ ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌సింగ్

తానూరు: నర్సరీలో పెంచుతున్న మొలకలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ సూచించారు. గురువారం మండలంలోని జౌలా(బి) గ్రామంలో పర్యటించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలకు నీటిని అందించి ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల భవనం పరిశీలించారు. అమ్మ ఆదర్శపాఠశాలలో భాగంగా మంజూరైన నిధులతో మరమ్మతులు సత్వరం చేపట్టాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి మతీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ లలిత

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ బాయమోల్ల లలిత తెలిపారు. మండలంలో 9 మంది ఎంపీటీసీలకు గాను రాజూర ఎంపీటీసీ నర్సవ్వ ఒక్కరే హాజరవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు



ముధోల్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై సాయికిరణ్

లోకేశ్వరం: నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరం ఎస్సై రాజు అన్నారు. గురువారం మండలంలోని పంచగుడి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. ఓటరు విధిగా తన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

ముధోల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం ముధోల్‌లో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్డుపై వస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. డబ్బు, మద్యం, రవాణా కాకుండా క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నందిరామయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐఎం, సీపీఐ, ఎంఎల్ మాస్ లైన్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీతోపాటు జిల్లాలోని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్మల్‌లోని మామిడి రాజన్నభవన్ (సీపీఎం కార్యాలయం)లో గురువారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా అన్ని రంగాల్ని నాశనం చేసిందన్నారు. మతోన్మాద విధానాల్ని ముందుకు తెస్తూ మత విభజన రాజకీయాల్ని ప్రోత్సహిస్తూ.. ప్రజాస్వామ్య విలువల్ని నాశనం చేస్తుందని మండిపడ్డారు. బడా పెట్టుబడిదారులు అదానీ, అంబానీలకు దేశంలో ఉన్న 25 మంది కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టిందని పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని పెంచి పోషించడంతో 80 శాతం మంది నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందన్నారు. సదస్సులో సీపీఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతనకుమార్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, వామపక్ష పార్టీల నాయకులు రామలక్ష్మణ్, బక్కన్న, లక్ష్మి, రాజేశ్, ఎండీ గాఫూర్, వెంకటేశ్, శంభు, పోశెట్టి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి'



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

సోన్: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. గురువారం సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి నర్సయ్య, వార్డు మాజీ సభ్యులు తలారి ప్రభాకర్, జక్క వనజ, మోహన్‌తోపాటు గ్రామానికి చెందిన 100 మంది బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జరిగిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మోహినొద్దీన్, రాజనర్సింహరెడ్డి, సాయన్న, గడ్డం స్వామి, పెద్ద లస్మన్న, గంగాధర్, లింగన్న, రమేశ్ రెడ్డి, అమృత్‌రాజ్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

పలువురి కుటుంబాలకు పరామర్శ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ముత్యంరెడ్డి, బన్సపల్లిలో మాజీ సర్పంచ్ మేకల సునీత మృతి చెందగా.. బాధిత కుటుంబాలను గురువారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. మేకల నరేశ్, దమ్మ రవి, అర్గుల రమణ, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా

దిలావర్‌పూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీకీ రాజీనామా చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మండల పార్టీ కార్యవర్గంతోపాటు పలువురు నాయకులు రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపినట్లు వెల్లడించారు. రాజీనామా చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కె.దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, రైతు బంధు నాయకుడు కోడె రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు బాపురావు, మాజీ ఎంపీపీ ఎల్లాల అమృతచిన్నారెడ్డి, కదిలి ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, మాజీ చైర్మన్లు భుజంగ్‌రావు పాటిల్, సంబాజీరావు పాటిల్, పీఏసీఎస్ డైరెక్టర్ దత్తురాం, మాజీ ఉపసర్పంచ్ మారుతిరావు, దిలావర్‌పూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధని రవి, ఆత్మ డైరెక్టర్ సప్పల రవి, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, నాయకులు ఆడెపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పనిప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

తానూరు: ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. షామియానాలు, తాగునీటి వసతి, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. పనుల కొలతలను ఎప్పటికప్పుడు తీసుకొని కూలీలకు గరిష్ఠ వేతనం కల్పించాలన్నారు. జాబ్‌కార్డులు లేనివారు దరఖాస్తు సుకుంటే పరిశీలించి మంజూరు చేయాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ గంగాధర్, ఆయా గ్రామాల టీఏలు, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బుంగతో జాగ్రత్త..



కుంటాల: మండలంలోని అందాకూర్ నుంచి పెంచికల్‌పాడ్ వెళ్లే మార్గంలో వంతెనపై పెద్ద బుంగ ఏర్పడింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, కుంటాల, ఫోన్: 95506 07360